


వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 212 | బుధవారం.29-10-2025 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

## పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మొంథా తీవ్ర తుపాన్

**విశాఖపట్నం, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గడిచిన గంటలో 10 కి.మీ వేగంతో తుపాన్ కదులుతుంది.ప్రస్తుతానికి మచిలీపట్నంకి 100 కిమీ, కాకినాడకి 180 కిమీ, విశాఖపట్నంకి 270 కిమీ దూరంలో కేంద్రీకృతం అయ్యింది.దగ్గరకు వచ్చే కొద్ది తీవ్ర ప్రబావం చూపుతుంది. ఇప్పటికీ భారీ గాలులతో కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడుతున్నట్లు సమాచారం.తీరందాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుంది.అనేక చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం కాబట్టి ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలనీఎండీ, విపత్తుల నిర్వహణ సంస్థ ఏం.డి. జైన్ తెలిపారు.

# పరిపాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ





## మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై సచివాలంయలో నిర్వహించిన సమీక్షకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు... ఉప సంఘంలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు.

**గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య** కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి... దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంగళవారం జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం... ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ

● వాగులు పొంగే అవకాశం ఉన్న చోట్ల మరింత అప్రమత్తం ● డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, గాలుల విధ్వంసాన్ని గుర్తించి పునరుద్ధణ పనులు ● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుఫాను ప్రభావంపై సీఎం చంద్రబాబు సమీక్ష





**అమరావతి, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుపాను ప్రభావంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో కలిసి సమీక్షించారు. గతంలో వచ్చిన తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మొంథా తుఫాను కోస్తాంధ్ర తీరానికి అత్యంత సమీపంగా వస్తోందని.. ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా చేరుకుని తీరాన్ని దాటే అవకాశముందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉందని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం తుఫాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని రెస్క్యూ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనా వేస్తూ అందుకు తగినట్టుగా యంత్రసామాగ్రిని, సమాచార పరికరాలను అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి ఎంత ప్రాంతం నీట మునిగింది...? ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో అంచనా వేసి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గ్రామ వార్డు సచివాలయాల నుంచి క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుని విశ్లేషించుకోవాలన్నారు. గతంలో హుద్ హుద్ తుఫాను సృష్టించిన విధ్వంసం నుంచి ప్రజలను నాలుగు రోజుల్లో తిరిగి బయటకు తెచ్చామని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదైనందున ఆ ప్రాంతంలోని ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మాత్తుగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయటంతో పాటు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు.

**ప్రభావిత ప్రాంతాల్లో తక్షణం పునరుద్ధణ చర్యలు**

గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు.

## తుఫాన్ ముంపు బాధితులకు అక్షయ పాత్ర ఆహారం పంపిణీ కి సన్నద్ధం.

**పునరావాస కేంద్రాలకు అన్న క్యాంటీన్ ద్వార ఆహారం పంపిణీ.**




**గుంటూరు, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సీఎం చంద్రబాబు ఆదేశాలు మేరకు మంగళగిరి హారే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ , అన్నా కాంటీన్ ద్వారా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆహార పంపిణీ కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని, హారే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆంధ్ర రీజియన్ ఉపాధ్యక్షులు విలాస దాస తెలిపారు. తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు అక్షయ పాత్ర అవరణ లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కేంద్రాలు కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.ఈ ఆహార సేవా కార్యక్రమాలు ప్రభుత్వము చేపట్టిన ముందస్తు చర్యలు (మంథా) లో భాగం గా తుఫాన్ ప్రభావం ఎదురయ్యే అవకాశం నేపథ్యంలో పునరావాస కేంద్రాల్లో ప్రజలకు సమయానికి పోషకమైన ఆహారం పంపిణీ ప్రారంభించటం జరిగింది అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార పంపిణీ కార్యక్రమాలను మరింత విస్తరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## బీసీ హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందాం

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సవిత**



**గుంటూరు , అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మొంథా తుఫాన్ నుంచి బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్.సవిత ఆదేశించారు. తుఫాన్ తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతతో మంత్రి సవిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీగా మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. పలువురు డీబీసీడబ్ల్యూవోలతోనూ మంత్రి స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత సవిత మాట్లాడుతూ, వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు 24 గంటలూ హాస్టళ్లలో ఉండడడంతో పాటు రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే అందివ్వాలన్నారు. బయట ఆహారాలను హాస్టళ్లలోకి అనుమతించొద్దన్నారు. తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ కోతలు ఉండే అవకాశముందని, ఇన్వర్టర్లను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గి పెట్టెలను పెద్ద మొత్తంలో ముందు జాగ్రత్తగా సమకూర్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ల ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని స్పష్టంచేశారు. మరుగుదొడ్లు, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. దోమలు చొరబకుండా హాస్టళ్ల గదుల కిటికీల వద్ద మెస్ లు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ దృష్ట్యా హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులు, విద్యార్థుల ఆరోగ్యంపై నివేదిక ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్ల విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

## మినప రైతులను ప్రభుత్వం అదుకుంటుంది

**తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పార్థసారథి విస్తృత పర్యటన...**



**నూజివీడు/ఆగిరపల్లి అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్థసారథి మంగళవారం విస్తృతంగా పర్యటించారు.నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లి మండలం, నెక్కలం గొల్లగూడెం,వట్టిగుడిపాడు ఆగిరిపల్లి గ్రామాల్లో మరియు నూజువీడు మండలం రామన్నగూడెం మరియు ఇతర ప్రాంతాలను మంత్రి పార్థసారథి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆగిరపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలో గండిపడి తెగిపోయిన చెరువును మంత్రి పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై మంత్రి అధికారులను అడిగి ఆరా తీశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు నష్టనివారణ చర్యల పై అధికారులు, స్థానిక ప్రజలతో చర్చించి.నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలన్నారు. ఆగిరపల్లి గ్రామంలో కల్వర్టు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలిన ప్రాంతాన్ని నీటి వసతులను పరిశీలించి రూ.1లక్ష మంజూరు చేసిన మంత్రివర్యులు.రామన్న గూడెం గ్రామంలో ముంపుకు గురైన మినప పొలాలు పరిశీలించి రైతుల కష్ట నష్టాలను తెలుసుకొని పూర్తి వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని అధికారులకు అదేశించిన మంత్రి. త్వరలో నిబంధనలు అనుసరించి ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు.నా నియోజకవర్గంలో ఏ ఒక్క రైతు ఏ ఒక్క కార్యకర్త మరియు ప్రజలు ఏ విదంగా నష్టపోవడానికి వీలులేదని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చిన మంత్రి వర్యులు.మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కట్ట తెగిపోయిన చెరువుల వద్ద తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు.

**CHANGE OF SURNAME**

I, **MADDHU RAMAKRISHNA (Old Name), S/o. Hari Babu**, Resident of Door No.5-52-18, Plot No.2, Amrutha Sai Enclave, 6/15th Lane, Brodipet, Guntur-522002, A.P. India. I have changed my surname as **MADDU RAMAKRISHNA (New Name), S/o. Hari Babu**. Hereafter my name is known as **MADDU RAMAKRISHNA S/o. Hari Babu.**

**CHANGE OF SURNAME**

I, **MADDHU HARI BABU (Old Name), S/o. Ramakrishna Rao**, Resident of Door No.5-52-18, Plot No.2, Amrutha Sai Enclave, 6/15th Lane, Brodipet, Guntur-522002, A.P. India. I have changed my surname as **MADDU HARI BABU (New Name), S/o. Ramakrishna Rao**. Hereafter my name is known as **MADDU HARI BABU, S/o. Ramakrishna Rao.**

**దస్తావేజులు పోయినవి**

కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన కాపురస్తుడు మానికల రంగారావు కుమారుడు మానికల శివాజీ కి చెందిన ఎస్.నెం.739/6 కు చెందిన 4493/2022 మరియు 6548/2017 కు చెందిన దస్తావేజులు వీరవల్లి నుండి గుడివాడ ఆటో లో వెళుతుండగా పడిపోయినవి. సదరు దస్తావేజులను ఉపయోగించి ఎవరేమి ఎటువంటి అన్యకాంతములు చేసిన యెడల చట్ట ప్రకారం తీసుకునే యావత్ చర్యలకు బాధ్యులు అవుతారని తెలియజేస్తూ , ఎవరికైనా పై నెంబర్ దస్తావేజులు దొరికినచో పై అడ్రస్ లో అందచేయవలసిందిగా కోరుతున్నాము.
**సెల్ నెం: 9948353599**

**CHANGE OF NAME AND SURNAME**

I, **VANI MADDHU (Old Name), W/o. Hari Babu**, Resident of Door No.5-52-18, Plot No.2, Amrutha Sai Enclave, 6/15th Lane, Brodipet, Guntur-522002, A.P. India. I have changed my name as **SUKHAVANI** and Surname as **MADDU (New Name), W/o. Hari Babu**. Hereafter my name is known as **MADDU SUKHAVANI, W/o. Hari Babu.**

## కోలంక, గొల్లపాలెంలో కూలిన భారీ చెట్లు..

**సహాయక చర్యల్లో పాల్గొన్న మంత్రి సుభాష్**





**రామచంద్రపురం, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తుఫాను ప్రభావంతో భారీగా వీచిన బలమైన గాలులకు రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక, గొల్లపాలెం గ్రామంల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో కోలంక రోడ్లో ప్రయాణిస్తున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అప్రమత్తమై అధికారులను పిలిపించి దగ్గరుండి, చెట్టును తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి దగ్గరుండి సహాయకచర్య లో పాల్గొనడంతో ఆగ మేఘాల మీద చెట్టును యంత్రాలతో తొలగించారు. అలాగే గొల్లపాలెంలో కూడా చెట్లు కూలడంతో మంత్రి సుభాష్ అధికారులను అప్రమత్తం చేసి దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మండలంలోని పలు పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు ధైర్యం చెప్పారు. విపత్కర పరిస్తితులను ఎదుర్కొనేందుకు కూటమి ప్రభుత్వ%శీ% సన్నద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు.

# మొంథా తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉంది.- ఇంచార్జ్ మినిస్టర్ సుభాష్

**మచిలీపట్నం అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మొంథా తుఫానును సమర్థవంతంగా ఎదుర్కునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సిద్ధంగా ఉందని రాష్ట్ర కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రివర్యులు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలిసి మచిలీపట్నం మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలో మండల పరిషత్ పాఠశాల లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి ప్రజలతో అందరూ బాగున్నారా అని వారు విచారించారు. అనంతరం మంగినపూడి బీచ్ ను సందర్శించి అక్కడ ఎగిసిపడుతున్న అలలను, బలమైన ఈదురుగాలులను పరిశీలించారు. అనంతరం జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మోంత తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం అంతా పూర్తిగా ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, ప్రమాదాలు ప్రాంతాల నుండి ప్రజలను తరలించేందుకు 222 సురక్షిత పునరావాస కేంద్రాలను గుర్తించామన్నారు. అందులో అవసరాన్ని బట్టి 162 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.అందులో ప్రస్తుతం ఉన్న 2,497 కుటుంబాలకు



కావలసిన మంచినీరు, ఆహారము తదితర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలో రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని అందులో ఒకటి మచిలీపట్నం రెండవది గుడివాడలో ఉన్నాయన్నారు. అలాగే నావికాదళం, సైనిక దళం సేవలను కూడా అవసరమైన పక్షంలో వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్తు తదితర అన్ని ప్రభుత్వ శాఖలు తుఫాను సహాయక చర్యలు చేపట్టేందుకు చాలా అప్రమత్తంగా ఉన్నారన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా మొబైల్ నెట్వర్క్ సంబంధించి అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేసామన్నారు. అలాగే అన్ని పునరావాస కేంద్రాల్లోనూ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచామన్నారు. వాతావరణ శాఖ ప్రకటించిన తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థులందరికీ సెలవులు ప్రకటించామని వారితో పాటు ప్రజలందరూ కూడా బయటకు రాకుండా సురక్షితంగా వారి ఇండ్లలోనే జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని సహకరించాలన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ మోంత తుఫాను వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చాలా అప్రమత్తంగా ఉంటూ అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుందన్నారు. ప్రమాదం జరిగే ప్రదేశాలను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకునీ సహకరించాలన్నారు. ఈ పర్యటనలో మంత్రులు వెంట మచిలీపట్నం డివిజన్ ఇంచార్జ్ గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, ఎంపీడీవో వెంకటేశు, తహసిల్దారు నాగభూషణం మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు తదితర అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ వ్యవస్థను సరిగా డిజైన్ చేయండి

**త్రాగునీరు, డ్రైనేజి సమస్యలపై ఎమ్మెల్యే గాంధీ కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ మరియు అధికారులతో సమీక్ష సమావేశం**



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 28 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ లోని హెచ్ ఎం డబ్ల్యూ ఎస్%డ%ఎస్ బి సర్కిల్ -4 ఆఫీస్ లో ఎండి కే.అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ సమక్షంలో త్రాగునీటి, డ్రైనేజీ సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ లో డ్రైనేజి సమస్య దాదాపుగా పరిష్కరించామని,కొన్ని కాలనీల్లో,బస్తీల్లో అరకొరగా డ్రైనేజీ సమస్య ఉందని ప్రజల నుండి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.పైపులు పగిలిపోయినా,ఇతర సమస్యలు తలెత్తినా వాటిని సకాలంలో మరమ్మత్తు చేయాలని అన్నారు.డ్రైనేజీ వ్యవస్థను సరిగ్గా డిజైన్ చేయడం,సరైన వాలు మరియు పైపుల వ్యాసం ఉండేలా చూసుకోవాలని సూచించారు.అలాగే డ్రైనేజీ పైప్లైన్ త్రాగునీటి పైప్లైన్ లో కలవకుండా క్రమ పద్ధతిగా వేసినట్లయితే నీటి కాలుష్య సమస్యలు తగ్గుతాయాన్ని అన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఎం డబ్ల్యూ ఎస్%డ%ఎస్ బి డైరెక్టర్ ఆపరేషన్స్ పీవీ శ్రీధర్,సీజీఎం నారాయణ,జిఎం కృష్ణ,జిఎం హరిశంకర్,జిఎం శ్రీనివాస్ రెడ్డి, మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్,కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్,అల్విన్ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్,మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్,హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్ని శ్రీనివాస్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి,బాలింగ్ గౌతమ్ గౌడ్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ సందీప్ కుమార్ మరియు తదితర డివిజన్ల డిజీఎం లు, మేనేజర్ లు తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్గిరి జోన్ లో ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవాలు.






**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా, జవహర్ నగర్, అక్టోబర్ 28:(వార్త ప్రభ)**రాచకొండ కమిషనరేట్, మల్కాజ్గిరి జోన్, కుషాయిగూడ డివిజన్ పరిధి రాధిక చౌరస్తా వద్ద రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు(ఐపీఎస్) ఆదేశాల మేరకు, పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించి, పోలీసు అమరవీరుల,ఆత్మకు నివాళులర్పించిన పోలీసులు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ,వెంకట్ రెడ్డి పాల్గొని సుమారుగా 500మందితో మానవహారం నిర్వహించి పోలీస్ అమరవీరుల వారోత్సవాలను జయప్రదం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకట్ రెడ్డిల తో పాటు, జవహర్ నగర్ పోలీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్ సైదయ్య,కుషాయిగూడ, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,కీసర ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆంజనేయులు, చర్లపల్లి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,నేరేడ్ మెట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ లు మరియు కుషాయిగూడ డివిజన్ పరిధిలోని ఐదు పోలీస్ స్టేషన్ల కు సంబంధించిన ఎస్సైలు, పోలీసు సిబ్బంది,పలు స్కూల్ విద్యార్థిని విద్యార్థులు,పలు సంఘాల నాయకులు,ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# కోడూరు మండల ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావద్దు



**కోడూరు,అక్టోబర్ 28 (వార్తా ప్రభ) :**కోడూరు మండల ప్రజలు నివాసాల నుంచి, పునరావస కేంద్రాల నుంచి బయటికి రావద్దని, కోడూరు ఎస్సై చాణిక్య సూచించారు.మొంథా తీవ్రతుపాన్ ప్రస్తుతం మచిలీపట్నానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉందని, తుఫాన్ తీరందాటే సమయంలో గంటకు 90-110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచి చెట్లు, విద్యుత్ వైర్లు తెగి, పిడుగులు పడే ప్రమాదం ఉందన్నారు.కావున ప్రజలు అధికారుల సూచనలు పాటించి జాగ్రత్త వహించాలని కోరారు.

# అభ్యుదయ అక్షర శిల్పి కామ్రేడ్ సి.రాఘువాచారి

**విజయవాడ నగర సీపీఐ కార్యదర్శి ...జి.కోటేశ్వరరావు**




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకునిగా పనిచేసి, ఎందరికో పాత్రికేయులకు గురువుగా, తాను నమ్మిన సిద్ధాంతాల కోసం తుది శ్వాస వరకు నిలిచినా నిరాడంబరుడు, నిత్యకృషీవలుడు కామ్రేడ్ సి.రాఘువాచారి అయన 6వ వర్ధంతి సందర్భముగా భారత కమ్యూనిస్టు పార్టీ, 36వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో నగర సహాయ కార్యదర్శి నక్క వీర భద్రరావు అధ్యక్షతన జరిగిన సంస్మరణ కార్యక్రమంలో నగర కార్యదర్శి కామ్రేడ్ జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత రాఘువాచారి చిత్ర పాఠానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా కోటేశ్వరావు మాట్లాడుతూ సంపాదకులకే సంపాదకులైన "సి. రాఘువాచారి" సంప్రదాయ శ్రీ వైష్ణవ కుటంబములో జన్మించినప్పటికీ చిన్న నాటికీ నుంచి కమ్యూనిస్టు భావజాలం అలవర్చుకుని వరంగల్లు లో బి.ఎస్సి పూర్తిచేసి, హైద్రాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం లో న్యాయ శాస్త్రం లో ఎల్.ఎల్.ఎం చదువుకునే రోజులలోనే అఖిల భారత విద్యారి సమాఖ్య లో విద్యారి నాయకునిగా ఎదిగి విద్యార్థి మరియు ఆ నాటి సామజిక సమస్యలపై తనదైన శైలిలో ఉద్యమాలు చేసిన చరిత్ర కామ్రేడ్ రాఘువాచారిదని ఢిల్లీలో వామపక్ష పత్రిక విలేకరిగా తన జీవన ప్రయాణం ప్రారంభించిన రాఘువాచారి చాల చిన్న వయస్సులో విశాలాంధ్ర సంపాదకునిగా బాధ్యతలలో చేరి తన రచనల ద్వారా, సంపాదకీయాల ద్వారా ఎంతో మంది కార్యకర్తలను సుశిక్షితులైన నాయకులుగా మార్చడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేసారు. నేటి తరం నాయకులు అయన జీవిత విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోని అభ్యుదయం వైపు అడుగులు వెయ్యాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, విశాలాంధ్ర పూర్వ సంపాదకులు ఎస్.కె. బాబు మాట్లాడుతూ రాఘువాచారి క్రమ శిక్షణ, నిరాడంబరత, లోతైన విశ్లేషణ, సమస్యల పట్ల సమగ్రమైన అవగాహనా ఆయనను పాత్రికేయ రంగములో ఎందరికో గురువుగా మార్చింది. కేవలం సంపాదకునిగానే కాకుండా అనేక రాజకీయ శిక్షణ తరగతులలో తన శిక్షణ, రేడియో ప్రసంగాల ద్వారా అనేక మందిని కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులను చేసి కమ్యూనిస్టు పార్టీ విస్తృతికి అవిరళ కృషి చేసారు. ఎదుటి వారికి చెప్పడమే కాకుండా తాను తూచా తప్పకుండ ఆ సిద్ధాంతాలను తన తుది శ్వాస వరకు పాటించిన మహోన్నత అక్షర శిఖరం కామ్రేడ్ సి.రాఘువాచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గంబ, నగర నాయకులు డి.వి.రమణ బాబు. తూనం వీరయ్య, కొడాలి ఆనందరావు, ఓర్సు భారతి, కె.ఆర్.అంజనేయులు, లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం.సాయి కుమార్, పార్టీ నాయకులు నాయకులు, నక్క రాజ్య లక్ష్మి, లంకె సాయి, బెవర శ్రీనివాసరావు, కొండేటి శ్రీనివాసరావు, పడాల కనకారావు, మూలి శివన్నారాయణ, కంచర్ల నాగేశ్వరరావు, టి.పూర్ణయ్య, ఆర్.మైఖేల్, విజయ్ స్థానిక డివిజన్ నాయకులు గుర్రం జమలయ్య, పి. రామచంద్రరావు, జి.శ్రీనివాస్, పి.సాయి, జి.కుమార్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# మొంథా తుఫాన్ దెబ్బకు పత్తి రైతులు విలవిల

● ఎడతెరపిలేని వర్షాలతో వాడిపోతున్న పత్తి పైరు ● మబ్బులతో పంటకు తెగుళ్ల బెడద ● రాలిపోతున్న పత్తి కాయలు ● పెట్టుబడి కూడా రాదని అన్నదాతల ఆవేదన ● పత్తి దిగుబడిపై తీవ్ర ప్రభావం ● మైలవరం నియోజకవర్గంలో 9 వేల ఎకరాల్లో సాగవుతున్న పత్తి ● నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి వేడుకోలు







**జి.కొండూరు అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మొంథా తుఫాన్ దెబ్బకు పత్తి రైతులు విలవిలలాడుతున్నారు.ఎడతెరపిలేని వర్షాలతో పత్తి పైరు వాడిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.పెట్టుబడి పూర్తయి దిగుబడి కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలపై మొంథా తుఫాన్ నీళ్లు చెల్లింది.మబ్బులతో పంట కు తెగుళ్ల బెడద పట్టుకుంది.పత్తి కాయలు వాడిపోయి రాలిపోతున్నాయి .భూమిలో తేమ శాతం తగ్గక ఎరుపు తెగులు ఆశించి చివరకు పైరు నల్లబడి ఎండిపోతోంది. పత్తి తీతకు వచ్చి విచ్చుకో కపోవడంతో పత్తి గుబ్బలుగా మారి నల్లబడి పోవడంతో సరైన ధర లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 9వేల ఎకరాలకు పైగా పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు.పత్తి చేలలో నీరు నిల్వ ఉండడంతో మొక్కల కాండాలు నల్లబారాయి.ఆకులన్నీ ఎర్రగా మారి రాలిపోతు న్నాయి.సొంత పొలం కలిగియున్న రైతులు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. కౌలు రైతులు కౌలు రూ.10 వేల నుంచి రూ.20 వేలు కలిపితే అన్ని ఖర్చులు కలిపి ఇప్పటికే రూ. 45 వేల వరకు ఖర్చు చేశా మంటున్నారు.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గడ్డమణుగు శివారు, లోయ గ్రామాలలో వందల ఎకరాల పత్తి పైరులో నీరు నిలిచి పోయాయి.వర్షాల వల్ల నాణ్యత కోల్పోయి గుబ్బల రూపంలో పత్తి దిగుబడి రావడంతో క్వింటా పత్తి రూ.3 వేల నుంచి రూ. 4వేలు లోపు మాత్రమే ధర పలుకు తోందని రైతులు వాపోతు న్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టక పోవడంతో పత్తిపై ఇక ఆశలు వదిలేసుకోవడమేనన్న ప్రశ్న మదిలో మెదులు తోందని పత్తి రైతులు అంటున్నారు.నష్టపోయిన పంటలకు ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

> ఎడతెరపిలేని వర్షాలతో పత్తి పంట దెబ్బతింటోందని రైతులు ఆందోళన చెందుతు న్నారు.ఇన్ని రోజులు కష్టపడి పండించిన పత్తి పంట కళ్లెదుటే పనికి రాకుండా పోతోందని ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.అప్పులు చేసి భారీగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట మొంథా తుఫాన్ తాకిడితో రైతులు విలవిలలాడుతున్నా రు.పంటనష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

**పాపిరెడ్డి నగర్ బస్తి అధ్యక్షులు చంద్రారెడ్డి, విద్యుత్ ఏ.ఈ. పీరు నాయక్**

**కూకట్ పల్లి,అక్టోబర్ 28(వార్తాప్రభ):**బస్తీ లో తలెత్తుతున్న విద్యుత్ సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపడమే తన ధ్యేయం అని కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. విద్యుత్ కోతలు, ట్రాన్స్ఫార్మర్ల వద్ద కంచె నిర్మాణాలు ఏర్పాట్లు ఇతర సమస్యలను అధిగమించేందుకుగాను విద్యుత్ విద్యుత్ ఏ.ఈ పీరు నాయక్ఆధ్వర్యంలో నిర్వహించిన బస్తి బాట కార్యక్రమంలో మంగళవారం ఉదయం పాపిరెడ్డి నగర్ బస్తీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి వారితో కలిసి బస్తీలో సమస్యలను వారికి వివరించారు. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని ఏ.ఈ హామీనిచ్చారు. అనంతరం చంద్రారెడ్డి మాట్లాడుతూ బస్తీలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని బస్తీ వాసులకు సూచించారు. అదే విధంగా విద్యుత్ అధికారులు స్పెషల్ డ్రైవ్ పేరుతో సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావడం పట్ల బస్తి వాసుల తరఫున వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేర్ని ధర్మారావు, సలహా దారుడు మరేళ్ల శ్రీనివాస్, అర్.తిరుపతిరెడ్డి, ప్రభాకర్.కె,లత. కె,యాదగిరి,శరత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వీరాచారి రాజు వెంకటేష్ శ్రీనివాస్ మేస్త్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# నగరంలో సిపిఎం బృందం పర్యటన

***ప్రమాదకరంగా డంపింగ్ యార్డ్ ప్రాంతం సిపిఎం విన్నపంతో 2 రోజులు డంపింగ్ నిలిపివేస్తామన్న అధికారులు***



**కాకినాడ, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తుఫాను నేపథ్యంలో కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో సిపిఎం పర్యటనలో భాగంగా సంజయ్ నగర్ లో గల డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని సిపిఎం బృందం మంగళవారం ఉదయం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ సంధ్యా నగర్ డంపింగ్ యార్డ్ కి ఒకే మార్గం ఉండడంవల్ల డంపింగ్ యార్డ్ చెత్త పేరుకుపోవడం వల్ల వాహనాలు రాకపోకలు చాలా ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. వర్షాలకు బురదగా ఆ ప్రాంతమంతా వాహనాలు లోపలికి వెళ్లడానికి సరైన మార్గం లేక గంటల తరబడి సంజయ్ నగర్ రోడ్డులో వేచి ఉండాల్సి వస్తుందన్నారు. వాహనాల నుండి చెత్తని డప్పు చేసే సమయంలో డ్రైవర్లు వర్కర్లు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని నగన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వారు, కమిషనర్ మరియు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్లకు తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వి చరణ్ స్వయంగా పలివెల వీరబాబు కి ఫోన్ చేసి మంగళవారం , బుధవారం డంపింగ్ యార్డ్ కు వాహనాలు రాకుండా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.అధికారుల స్పందనకు ధన్యవాదాలు తెలియచేస్తూ తుఫాన్ సందర్భంగా ప్రజలు రక్షణతో పాటు ప్రజల్లో భాగమై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది క్షేమం కూడా అధికారులు చూడాలని కోరుతున్నామన్నారు. సిపిఎం నగర కమిటీ సభ్యులు కె. సత్తిరాజు, మలక వెంకటరమణ లతో పాటు మేడిశెట్టి వెంకటరమణ, టి. రాణి తదితరులు ఈ పర్యటనలో ఉన్నారు.

# క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజలకు భరోసా

***తుపాను ప్రతిస్పందన చర్యల్లో నిమగ్నమైన జిల్లా అధికారులు***

***- ప్రాణ, ఆస్తి నష్టం జరక్కుండా జేసీ ఎస్.ఇలక్కియ, ఆర్డీవోలు కె.చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి చర్యలు***





**నందిగామ, : అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎన్టీఆర్ జిల్లాలో మొంథా తుపాను వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సారథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదో పరిశీలించారు. ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను, పునరావాస కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి సందర్శించి, అధికారులకు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలూ ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. మండలస్థాయి విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని బృందాల సిబ్బందితో మాట్లాడి ఏమాత్రం అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ కంచికచర్ల మండలంలోని పరిటాల చెరువుతో పాటు స్థానికంగా ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, వాటర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. నందిగామ మండలం ఐతవరం గ్రామంలో వరి పొలాలను, రైతు సేవా కేంద్రాన్ని, పునరావాస కేంద్రాన్ని, నందిగామలో వరద ముప్పు ఉంచి ఉన్న డీవీఆర్ కాలనీని పరిశీలించారు. జగ్గయ్యపేట పురపాలక సంఘ కార్యాలయం, చిల్లకల్లు ఎంపీడీవో కార్యాలయంలో విపత్తును ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంచిన యంత్ర సామాగ్రిని, జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని, మొబైల్ టవర్ను పరిశీలించారు. తుపాను సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అధికారుల సూచనలు పాటించాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలను ఉపయోగించుకోవాలని జేసీ ఇలక్కియ సూచించారు.

# జాతిపితకు నివాళు లర్పించిన యార్లగడ్డ

**గన్నవరం, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతిపిత మహాత్మా గాంధీ సమాధి వద్ద ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నివాళులర్పించారు. న్యూఢిల్లీ పర్యటన లో ఉన్న యార్లగడ్డ సోమవారం ఉదయం సహచర ఎమ్మెల్యేలతో కలసి యమునా నది తీరంలోని మహాత్మా గాంధీ సమాధి రాజ్ ఘాట్ ను సందర్శించి గాంధీ మహాత్ముని సమాధిపై పుష్పాలను ఉంచి, జాతిపిత సేవలను స్మరించుకొని ఆయనకు ఘన నివాళులర్పించారు.






సాయంత్రం 6 తర్వాత తీరం దాటే ప్రక్రియ మొదలు.. రాత్రి 11 గంటలకు పూర్తిగా తీరం దాటే అవకాశం.. ఓడలరేవు, అంతర్వేది మధ్యలో తూర్పుపాలెం-కేసవదాసు పాలెం మధ్య తీరం దాటనున్న తుఫాన్.. ల్యాండ్‌ఫాల్ అయినప్పటి నుంచి పూర్తి తీరం దాటే వరకు 5 గంటలు పట్టే ఛాన్స్......**వార్తా ప్రభ, అమరావతి**





నూజివీడు నియోజకవర్గం, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

**వార్తా ప్రభ, నూజివీడు**

# శ్రీకృష్ణ ఆలయంలో కార్తీకమాస మొదటి సోమవారం పూజ కార్యక్రమం.



**ప్రొద్దుటూరు, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కార్తీకమాసం మొదటి సోమవారం శుభసందర్భంగా శ్రీకృష్ణ ఆలయంలో సోమవారం కార్తీక దీపోత్సవం ఆకాశదీపం పూజా జరిగినది. ఈ పూజలో శ్రీకృష్ణాలయ యాదవ్ సేవా సంఘం, కమిటీ ఉపాధ్యక్షుడు అయినా వేల్పుల బాల పుల్లయ్య యాదవ్ దంపతులు మరియు అధ్యక్షుడు దాసరి బాలసుబ్బరాయుడు యాదవ్, సంగటి రవీంద్ర యాదవ్, రామనబోయిన రామసుబ్బన్న యాదవ్, వేల్పుల భాస్కర్ యాదవ్, మొదలగు కమిటీ సభ్యులు, ప్రొద్దుటూరు లోని మహిళలు విశేషంగా పాల్గొని ,కార్తీక దీపోత్సవం, ఆకాశదీపం పూజా కార్యక్రమం నిర్వహించారు.

# మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు మైక్ సెట్ బహూకరణ



**గిద్దలూరు, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గిద్దలూరు పట్టణంలోని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారి సమావేశం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో సంస్థ చేయవలసిన సామాజిక కార్యక్రమాలను అధ్యక్షులు యం. సత్యనారాయణరెడ్డి సభ్యులకు వివరించారు. సభ్యత్వం అత్యధికంగా నమోదు చేసిన విశ్వనాథ్ ను సన్మానించారు. సూర్య విద్యా నికేతన్ పాఠశాల కరస్పాండెంట్ బ్రహ్మానంద రెడ్డి తన సొంత నిధులతో మైక్ సెట్ ను సంస్థ కు అందజేశారు. ఈ సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు బ్రహ్మానంద రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు గంజి వీరయ్య, చైర్మన్ శివారెడ్డి , కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, జిల్లా సభ్యులు ఏసేబు, సోషల్ మీడియా కన్వీనర్ పిచ్చయ్య, వివిధ విభాగాల కమిటీ అధ్యక్షులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# డీ.ఈ.ఓ. పదోన్నతుల్లో అసిస్టెంట్ డైరెక్టర్లను మినహాయించాలి.

**● పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు,ఏం. ఈ. ఓ. లకు ఉప విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు ఇవ్వాలి. ● 12 పాయింట్ సైకిల్లో పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు కోల్పోయిన డీ.ఈ.ఓ. పదోన్నతులను బ్యాక్లాగ్ గా ఉంచాలి. ● నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్**



**విజయవాడ, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వన్ టైం ఎక్సెంప్షన్ క్రింద గతంలో 12.సైకిల్ పాయింట్ లలో ఉన్న పోస్టులు కంటే అధికంగా ఒకేసారి అసిస్టెంట్ డైరెక్టర్లు డీఈవోలు/డీ.డీ.లు గా పదోన్నతులు పొంది ఉన్నారని ఇప్పటికే వారు అదనం గా ఉన్నందున డివో పదోన్నతుల్లో ఏడీలను అడిక్వసి గా పరిగణించి డీఈవో పదోన్నతుల నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాసరావు లు ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 505 మరియు 73 ప్రకారం ప్రతి 12 మంది లో కేవలం ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు మాత్రమే డిఈవోలుగా పదోన్నతి కల్పించాల్సి ఉండగా డివైఓ పోస్టు ఖాళీగా ఉన్నందున మరియు ఇతర పాయింట్ సైకిల్లో వారు లేనందున దాదాపు 19 మంది అసిస్టెంట్ డైరెక్టర్ లకు వన్ టైం ఎక్సెంప్షన్ క్రింద పదోన్నతులు కల్పించడం జరిగిందని అదేవిధంగా వీరి క్యాడర్ స్ట్రెంగ్త్ ప్రకారం దాదాపు 80 మంది అసిస్టెంట్ డైరెక్టర్లుగా ఉండాల్సి ఉండగా దీనికి అదనంగా మరో 40 మంది వరకు అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొంది ఉన్నారని ఇది అసంబద్ధమనీ బోధనేతరులను విద్యాశాఖ అధికారులుగా నియమించడం వలన విద్య వ్యవస్థ నిర్వీర్యం అవుతుందని, ఇప్పటికే 40 శాతం మంది పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను వీడారని విశదీకరిస్తూ ప్రభుత్వ పాఠశాలల మనుగడ కొనసాగించాలంటే విద్యా వ్యవస్థలో సంస్కరణలు నూతన జాతీయ విద్యా విధానం సిఫార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే బోధన అనుభవం కలిగి ఉన్నటువంటి ఉపాధ్యాయులను మరియు డైట్ పలెక్చరర్లు విద్యాశాఖ అధికారులు గా నియమిస్తేనే సాధ్యమని ఉదహరించారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల అభివృద్ధి దృష్ట్యా పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను ఉపవిద్యా శాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించి 12. సైకిల్ ను అమలు చేయటం ద్వారా వీరి నుండి జిల్లా విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని అంతవరకు ఇప్పటికే అధికంగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ల ను పదోన్నతుల నుంచి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు.

# యలమంచిలి చొరవతో ప్రమాదకర చెట్టు తొలగింపు



తొలగించక ముందు



తొలగించిన తరువాత

**కంకిపాడు అక్టోబర్ 28 (వార్తా ప్రభ, ప్రతినిధి)** మండల కేంద్రమైన కంకిపాడులో జాతీయ రహదారి ఆనుకొని బిస్మిల్లా హోటల్ వద్ద సుమారు 70 సంవత్సరాల నాటి చెట్టు ఎండిపోయి, పడిపోవడానికి సిద్ధంగా ఉండి, ప్రమాదకరంగా ఉంది దీనిని గమనించిన టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు తుఫాను వలన గాలి దుమారానికి కూలిపోయి వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలు బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ మరియు రోడ్లు భవనాల శాఖ అధికారులకు కంప్లైంట్ ఇవ్వడంతో విద్యుత్ శాఖ సిబ్బంది స్పందించి ఏఈ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన చెట్టును తొలగించి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. ఎలమంచిలి కిషోర్ బాబు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# తుఫాను సంసిద్ధతపై సమీక్షను నిర్వహించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూ ఢిల్లీ/విజయవాడ (పి.ఐ.బి.), అక్టోబర్ 28:**తూర్పు తీరంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా మరియు తెలంగాణలలో మోంతా తుఫాను ప్రభావాన్ని అంచనా వేస్తూ, ముందస్తు చర్యలు తీసుకోవాలని రైల్వేలను కేంద్ర రైల్వే, సమాచార %ు% ప్రసార, ఎలక్ట్రానిక్స్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఆదేశించారు. ఈరోజు తుఫాను సంసిద్ధతను సమీక్షించారు. డివిజనల్ వార్ రూమ్‌ల క్రియాశీలత,ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం మరియు గుంటూరు డివిజన్లలో అవసరమైన సామాగ్రి, యంత్రాలు మరియు మానవవనరులను సిద్ధం చేయడం తో పాటు ప్రయాణీకుల అసౌకర్యాన్ని తగ్గించడానికి రైలు కార్యకలాపాలను పర్యవేక్షించడం చేయాలన్నారు. ఈస్ట్ కోస్ట్ , సౌత్ కోస్ట్ మరియు దక్షిణ మధ్య రైల్వే జోన్‌లు అత్యవసర ప్రతిస్పందన కోసం వనరులను సమీకరించడానికి అవసరమైన జాగ్రత్తలు చేపట్టమని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఎక్కడ ఎవరికీ ఇబ్బంది లేకుండా తుపాను చర్యలు తీసుకుంటున్నాం

**తహసీల్దార్ శాంతి లక్ష్మి**





**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 28( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలం లోఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా ప్రజా భద్రత, క్షేమమే లక్ష్యంగా తుపాను ప్రతిస్పందన చర్యలు తీసుకున్నామని మండల తహసీల్దార్ శాంతి లక్ష్మి తెలిపారు. మంగళవారం మొంథా తుపానుకు సంబంధించి క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా నవాబు పేట. కొనకంచి. పెనుగంచిప్రోలు చెరువు లు పరిశీలించారు. అలాగే మునేరు ఒడ్డున వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం వద్ద వ్యాపారాలు చేస్తూ జీవిస్తున్న చిరు వ్యాపారులకు తుపాను గురించి జరగ బోవు పరిణామాలు గురించి తహసీల్దార్ శాంతి లక్ష్మి, మండల ఎం పి డి ఓ జి. శ్రీను, ఎస్ ఐ అర్జున్ వారికి తెలిపారు. అమ్మ వారి సత్రాల ల్లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తాగునీరు, వైద్య సేవలు.. పారిశుద్ధ్యంపైనా ప్రత్యేక దృష్టిపెట్టాలని,ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు సూచించారు. సచివాలయం పంచాయతీ కార్యాలయం ప్రతి ప్రభుత్వ అధికారులు తుపాను తీవ్రత ను దృష్టి లో వుంచుకుని ముఖ్యంగా రెవిన్యూ శాఖ, విద్యుత్‌శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, ఎన్ ఎస్ పి శాఖ, పోలీస్ శాఖ తప్పకుండా అందుబాటులో వుండాలని తెలిపారు.

# ముఖ్యమంత్రితో విష్ణువర్ధన్‌రెడ్డి భేటీ



**అమరావతి , అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారతీయ జనతా పార్టీ జాతీయ కమిటీ సభ్యులు ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశంలో అతి పెద్ద ఐటీ విదేశీ పెట్టుబడులు గూగుల్ సంస్థ నుంచి విశాఖపట్నంలోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమరావతిలో నిర్మాణాలు వేగవంతం కావడంపై ఆయన ముఖ్యమంత్రిని అభినందించానని ఈ సందర్భంగా మీడియాతో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయుడుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిజమైన డబుల్ ఇంజన్ పాలన అందించిందని, ఆయన తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతాల సురేష్, భాజపా మీడియా ప్రతినిధి చిన్నపరెడ్డి రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.

# మంగళగిరి పట్టణంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ

**మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన నాయకులు**





మంగళగిరి, **అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. 10వ వార్డుకు చెందిన బొబ్బా వీరాంజనేయులకు రూ. 3 లక్షల 53 వేలు, బాపణయ్యనగర్‌కు చెందిన పిల్లి ప్రమీలకు రూ. లక్షా 20 వేలు, వీవర్స్‌కాలనీకి చెందిన చిన్నం అనురాధకు రూ. 25,000 వేలు, టిప్పర్లబజార్‌కు చెందిన షేక్ సుభానికి రూ. 23,000 వేలు, షేక్ రియాజ్‌కు రూ. 25,166 వేలు, ద్వారకానగర్‌కు చెందిన కొడూరు వాణికి రూ. 30,028 వేలు, కుప్పురావుకాలనీకి చెందిన గొర్రె అయ్యప్ప నరసింహాస్వామికి రూ. 20,000 వేలు, శ్రీలక్ష్మీనరసింహాస్వామికాలనీకి చెందిన ఉడతా సీతారావమ్మకు రూ. 28,400 వేలు, ఇస్లాంపేటకు చెందిన పఠాన్ మహబున్నిసాకు రూ. 26,084 వేలు, మార్కెండేయకాలనీకి చెందిన మునగాల అలివేలుకు రూ. 30,546 వేలు, ఎస్‌ఎమ్ పురంకు చెందిన బట్టు శశికళకు రూ. 25,656 వేలు, గండాలయ్యపేటకు చెందిన చింతల శివకుమారికి రూ. 52,414 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్

# కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ పునః ప్రారంభించండి

**రాష్ట్ర సదస్సులో పి డి ఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్**



**విజయవాడ, అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పునః ప్రారంభించండని పి డి ఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బాలోత్సవ భవన్ లో కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ కోసం చేసిన యాక్ట్ 30 రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ పునః ప్రారంభించాలని కోరుతూ రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు,డాక్టర్ గేయానంద్ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ ఇప్పటి వరకు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాంట్రాక్టు లెక్చరర్స్ న్యాయమైన డిమాండ్ ముఖ్యమంత్రి చంద్రబాబు,విద్యాశాఖా మంత్రి లోకేష్ వెంటనే పరిష్కరించాలని కోరారు. 2024 మరియు 2025 మే నెలకు సంబంధించిన వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. యు టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్స్ సర్వీస్ ప్రభుత్వం రెగ్యులరైజేషన్ చేసేంత వరకు అండగా ఉంటామన్నారు. 62 సంవత్సరాలకు పదవీవిరమణ వయసు పెంచి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమం అనంతరం బందర్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్దకు ర్యాలీగా వెళ్లి నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని,114జీవో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా పరిరక్షణ సమితి చైర్మన్ రాజగోపాల్, ప్రభుత్వ జూనియర్,డిగ్రీ,పాలిటెక్నిక్ కాంట్రాక్టు లెక్చరర్స్ రాష్ట్ర నాయకులు డాక్టర్ వై.జాన్ బాబు,మాణిక్యం గొర్ల,బిజె గాంధీ,దాసరి రాజు,కలగాని శ్రీనివాస్ యాదవ్,సుందర్రావు,సాయిరాజు,స్వాతి,దుర్గా మల్లీశ్వరి,రాఘవేంద్ర రెడ్డి,కాశీ రత్నం,ఖాదర్ వల్లీ,మోహన్,రామాంజనే యులు తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు గురైన మహిళ

**మెరుగైన వైద్యం కోసం జగ్గయ్యపేట తరలింపు.....**



**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 27( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన బత్తుల భవాని(30) వ్యవసాయ పనుల నిమిత్తం పత్తి తీస్తుండగా పాము కాటు కు గురైంది. వెంటనే స్థానికులు పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనం ద్వారా జగ్గయ్యపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలించారు. ప్రస్తుతం ప్రమాదం ఏమీ లేదని వైద్యులు తెలుపుతున్నారు.

# మొంథ తుఫాను నేపథ్యంలో విస్తృతమైన చర్యలు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మొంథ తుఫాను నేపథ్యంలో విస్తృతమైన చర్యలు చేపట్టామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగరంలో 41 పునరవాస కేంద్రాలు ఏర్పాటు చేయటమే కాకుండా అందులో వచ్చిన ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు అన్ని కల్పిస్తున్నామని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం సదుపాయం కల్పిస్తున్నామని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు 146 మందికి భోజన సౌకర్యాలు కల్పించామని అన్నారు. లోతట్టు, కొండవాలు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఆటోల ద్వారా మైక్ ల ద్వారా నిరంతరాయంగా సురక్షితమైన ప్రదేశాలకు తరలించేందుకు అవగాహన కల్పిస్తున్నామని, మరోవైపు ప్రజలకు ఎటువంటి ప్రమాదకరమైన సంఘటనలు చోటు చేసుకోకుండా నగర పరిధిలో గల ప్రమాదకరమైన 60 వృక్షాలను, హోర్డింగ్లను, తొలగించామని అందులో భాగంగా 243 హోర్డింగ్లు, పాత భవనాల్లో నివసిస్తున్న 49 కుటుంబాలకు సురక్షితమైన ప్రదేశాలకు తరలించామని, ప్రమాదకరమైన ప్రదేశాలలో నివసిస్తున్న 102 కుటుంబాలను సురక్షితమైన ప్రదేశాలకు తరలించమని అన్నారు. నగర పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి భంగం వాటిల్లకుండా సోమవారం రాత్రి కంపాక్టర్ బిన్లు అన్నిటినీ శుభ్రపరిచారని, చౌకింగ్ పాయింట్లలో వ్యర్థాలను తొలగించేందుకు అదనంగా 100 పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశారని, పునరావస కేంద్రాలలో ప్రజలకు దోమల వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అదనంగా మలేరియా సిబ్బందిని పెట్టి ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నగర పరిధిలో గల డ్రైన్ల లో డీసిల్టింగ్ ప్రక్రియను 20 జెసిబి లతో 9 లాంగ్ ఆర్మ్ తో , ప్రత్యేక సిబ్బంది తో వేగవంతంగా చేయిస్తున్నారని, నీటి నిల్వలు ఉన్నచోట 13 పంపు సెట్లు, 78 ఆయిల్ ఇంజెన్తో మోటార్లు, 28 గుల్ఫేర్ లు, 29 ట్రాక్టర్ల సహాయం తో తొలగిస్తున్నారని, నగర పరిధిలోగల 13 ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలను మార్చారని కమిషనర్ తెలిపారు. నగర పరిధిలోని 41 రిహాబిలిటేషన్ సెంటర్ అన్నిటిలోనూ తీసుకోవాల్సిన సురక్షితమైన అగ్నిమాపక చర్యలను, వియంసి ఫైర్ వింగ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్కడున్న సిబ్బందికి సురక్షితమైన చర్యలపై అవగాహన కల్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు.

# ఘనంగా ముగిసిన పంచా యాతన యాగం

**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 28( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామంలోని మునేరు ఒడ్డున వున్న కేఎల్ ఫంక్షన్ హాల్ లో ఈ నెల 18వ తేదీ నుండి 72 మంది రుత్వికులతో నిర్వహిస్తున్న పంచాయతన యాగం మంగళవారం తో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వేద పండితులు పూర్ణాహుతి నిర్వహించి యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వేద పండితులు. దిలీప్ కుమార్ ఖమ మర్ల కిరణ్ కుమార్ శర్మ లంక లక్ష్మణ శర్మ కృష్ణచంద్ర ఉపాధ్యాయ పిసుపాటిఘనంగా ముగిసిన పంచా యాతన యాగంపెనుగంచిప్రోలు, అక్టోబర్ 28( వార్త ప్రభ) పెనుగంచిప్రోలు గ్రామంలోని మునేరు ఒడ్డున వున్న కేఎల్ ఫంక్షన్ హాల్ లో ఈ నెల 18వ తేదీ నుండి 72 మంది రుత్వికులతో నిర్వహిస్తున్న పంచాయతన యాగం మంగళవారం తో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా వేద పండితులు పూర్ణాహుతి నిర్వహించి యాగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వేద పండితులు. దిలీప్ కుమార్, మర్ల కిరణ్ కుమార్ శర్మ, లంక లక్ష్మణ శర్మ, కృష్ణచంద్ర ఉపాధ్యాయ, పిసుపాటి చరణ తేజ శర్మ, ఇంగువ విజయ గోపాలకృష్ణ శర్మ మరియు సిబ్బంది భజంత్రీల వారు అందరూ పాల్గొన్నారు.



# ఉద్భతంగా ప్రవహిస్తున్న నల్లవాగు

## చేజర్ల ఎస్.టి కాలనీలో ఎంపీడీవో పరిశీలన ఎప్పటికప్పుడు నల్లవాగు ఉధృతిని పరిశీలిస్తున్న మండల అధికారులు





**చేజర్ల అక్టోబర్ 28 (వార్తాప్రభ)** మండలంలో చేజర్ల తూర్పు ఖమ్మంపాడు మధ్య ప్రధాన రహదారిలో నల్లవాగు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో బిల్లుపాడు యనమదల కాకివాయి తూర్పు ఖమ్మంపాడు ప్రజల రాకపోకల పూర్తిగా స్తంభించడం జరిగినది.చేజర్ల మండల అభివృద్ధి అధికారి ఇరిగేషన్ ఈఈ మరియు సంబంధిత అధికారులు పూర్తి పర్యవేక్షణలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎప్పటికప్పుడు నల్లవాగు ఉధృతిని పరిశీలించడం జరుగుతుంది.అలాగే చేజర్ల ఎస్టీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరడంతో వారిని ఎంపీడీవో స్వయంగా వెళ్లి పరిశీలించడం జరిగినది.అలాగే మండలంలోని పలు గ్రామాలలో అధికారులు స్వయంగా వెళ్లి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ సూచనలు సలహాలు పాటించాలని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ బయట తిరగకూడదని పేర్కొన్నారు.పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఉన్నామని ఎవరికైనా ఇబ్బందులు తలెత్తితే తక్షణమే అధికారులను సంప్రదించాలని వారు ప్రజలకు సూచనలు ఇచ్చారు

# బుడమేరులో ఉన్న వ్యర్థాలను తొలగించండి

## విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బుడమేరులో ఉన్న గుర్రెపుడెక్కులను, వ్యర్థాలను తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, బుడమేరు, దాబా కొట్లు, అయోధ్య నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుడుమేరు కాలువలోని వ్యర్ధాలను తొలగించాలని, నగరంలో డీసిల్టింగ్ పనులను నిరంతరాయంగా చేస్తుండాలని, నీరు ప్రవాహానికి ఏమాత్రం ఆటంకం లేకుండా వ్యర్ధాలను తొలగించేటట్టు అధికారులు పరివేక్షిస్తుండాలని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ఎంకే బిగ్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రంను క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్కడ వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా త్రాగునీరు, వాడుకనీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ, పడుకునేందుకు సౌకర్యాలు, భోజన సదుపాయం వంటి అంశాలలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి అయోధ్య నగర్ లో గల అన్న క్యాంటీన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని, ఏమైనా మరమ్మతులు ఉన్నచో వెంటనే చేయించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో బయాలజీ కామేశ్వరరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంతేరు పునరావాస కేంద్రం సందర్శించిన ఉప్పాల రాము

**పెదన వార్తప్రభ అక్టోబర్ 28:** కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామం మొంథా తుఫాన్ కారణంగా తుఫాన్ భవనం లో ఏర్పాటు చేసిన పునరావాస భస కేంద్రంలను మంగళవారం సందర్శించి ఇబ్బందులను అడిగి తెలుసుకుని అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చిన పెదన నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉప్పాల రాము ఈ కార్యక్రమంలో పెదన నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు పిన్నింటి మహేష్ గరికపాటి రామా నాయుడు కొండవీటి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



# జైత్రయాత్రలా సీఎం చంద్రబాబు యుఏఈ పర్యటన....

**● ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయం... ● ఆంధ్రప్రదేశ్ ను మళ్ళీ గర్వంగా స్వర్ణాంధ్రంగా తీర్చిదిద్దుతాం... ● టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్లరమేష్...**



**అమరావతి అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు యుఏఈ పర్యటన, మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన జైత్రయాత్రలా సాగిందని. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని వైసీపీ ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా రాష్ట్రాభివృద్ధే అజెండా ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు నేతృత్వంలోని తమ కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తెలిపారు అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓవైపు ముఖ్యమంత్రి యుఏఈ లో పెట్టుబడి వేట కొనసాగిస్తుంటే మరోవైపు ఆస్ట్రేలియాలో రాష్ట్రానికి పెట్టుబడుల జాతర తీసుకువచ్చేందుకు చంద్రబాబు లోకేష్ లు శ్రమిస్తున్నారని ఆయన తెలిపారు. వీరు పడుతున్న శ్రమ వలనే నేడు విశాఖకు 15 బిలియన్ డాలర్లతో ఏఐ సిటీ ఏర్పాటుకు గూగుల్ ముందుకొచ్చిందని ఆయన తెలిపారు వైసీపీ చేయలేని అభివృద్ధి, తీసుకురాలేనన్ని పెట్టుబడులు, పరిశ్రమలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని తమ కూటమి ప్రభుత్వం తీసుకువస్తుందని ఆయన తెలిపారు. ప్రజల ఆశయాల సాధన కోసం, ఉద్యోగ సృష్టి కోసం, రాష్ట్ర ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం ప్రతీ రోజూ కృషి చేస్తోందని,కానీ ప్రజలకు మంచి జరగడం జగన్ కు ఇష్టం లేకనే చంద్రబాబుపై తమ ఓటమి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తూ, బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాడని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ను భారత్ లోనే కాదు ప్రపంచ పెట్టుబడుల గమ్యంగా నూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు యుఏఈ పర్యటన సాగిందని ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనువైన వాతావరణాన్ని వివరించి ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారని, దుబాయ్, అబుదాబీ వంటి దేశాల్లో పర్యటించి రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, హౌసింగ్ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై అనేక కంపెనీల ప్రతినిధులతో చర్చించారని ఆయన తెలిపారు. షరఫ్ గ్రూప్, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్, బుర్జీల్ హోల్డింగ్స్, మస్టార్, అగియా, లులూ, ఏడిఎన్ఓసీ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులతో లాజిస్టిక్స్, ఆరోగ్యరంగం, షిప్ బిల్డింగ్, మైనింగ్ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై మాట్లాడారని ఆయన తెలిపారు. ఏపీలో దేశంలోనే అతిపెద్ద 1,054 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, పోర్టులు, రహదారులు, ఎయిర్ కనెక్టివిటీ తో పాటు సబ్సీ కేబుల్ లాండింగ్ స్టేషన్లో ఉన్న రాష్ట్రం కావడం వల్ల పెట్టుబడులకు ఇది అత్యంత అనుకూలమైన గమ్యం అవుతుందని వివరించి ఆహ్వానించారని ఆయన తెలిపారు. అమరావతి విశాఖపట్నం తిరుపతి వంటి నరాలు సాంకేతిక ఇన్నోవేషన్ పరిశ్రమల కేంద్రాలుగా ఎదుగుతాయని గ్రీన్ ఎనర్జీ గ్రీన్ హైడ్రోజన్ డేటా సెంటర్లు ఎలక్ట్రానిక్స్ ఐటి రంగాలలో పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం సపోర్ట్ ఇస్తుందని పారిశ్రామికవేత్త లకు వివరించారని ఆయన తెలిపారు. ప్రపంచ పెట్టుబడిదారులు రాష్ట్రం అందించే స్థిరమైన పాలన పారి దర్శక విధానాలపై విశ్వాసం ఉంచుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు భూమి నీరు విద్యుత్తు నైపుణ్య కలిగిన మానవ వనరులు సమృద్ధిగా ఉన్న అని ప్రజెంటేషన్ ఇచ్చారని ఆయన తెలిపారు. విశాఖలో నవంబర్ 14,15 న జరగబోయే సి ఐ ఐ భాగ్య స్వామి సదస్సుకు హాజరుకావాలని యూఏఈ లోని పారిశ్రామికవేత్తలను ప్రభుత్వ పరిధిలో ఆహ్వానించారని ఆయన తెలిపారు. వైసిపి చేయలేని అభివృద్ధిని వారు కోల్పోయిన పెట్టుబడులను తమ కూటమి ప్రభుత్వం తిరిగి తెస్తుందని ఆయన తెలిపారు. మాటలతో కాదు చేతలు చూపించడం అంటే ఇదేనని కొత్త పరిశ్రమలు కొత్త ఉద్యోగాలు కొత్త అవకాశాలతో రాష్ట్రం మళ్ళీ ప్రగతి దిశగా అడుగులు వేస్తుందని ఆయన తెలిపారు. ప్రజల సంక్షేమమే మా ధ్యేయం అభివృద్ధి మా అజెండా ఆంధ్రప్రదేశ్ ను మళ్ళీ గర్వంగా స్వర్ణాంధ్రంగా తీర్చిదిద్దుతామని పాతర్ల రమేష్ తెలిపారు.

# తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్త చర్యలు

**● సెలవుల్లో ఉన్న పోలీసులను సైతం వెనక్కి రప్పించిన సి పి ● నగరంలో 600 హెూర్డింగ్స్ కిందకు దింపివేత ● 42 డ్రోన్స్ తో పర్యవేక్షణ ● 10 వేల సి సి కెమేరాల పహారా ● విజయవాడ నగర పోలీసు కమిషనర్ వెల్లడి**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వాతావరణం శాఖ హెచ్చరించినట్టుగా ముంథా తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రాణనష్టం ఆస్తి నష్టం జరక్కుండా చూడ్డానికి అన్ని శాఖల అధికారులు ఎంతో అప్రమత్తంగా తమ తమ పరుదుల్లో సిద్ధమయ్యారు. ముక్యంగా నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు తమ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెలవుల్లో ఉన్న సిబ్బంది ని సైతం వెనక్కి రప్పించారు. ముఖ్యంగా కొండప్రాంత విస్తీర్ణం ఎక్కువగా వున్న పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అయన ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. పాతబస్తీలో ఉన్నవారు చాలా అప్రమత్తంగా ఉండాలని పదే పదే సలహాలు సూచనలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 75 వాగులు వంకలు వున్నాయని వాటికి వచ్చే వరదలు అంచనాలు వేసి వాటి పరివాహక ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు సహాయక చర్యలు తీసుకోవాలని సందేశాన్ని పంపించారు. చెట్లు విరిగిపడ్డ, కొండచరియలు విరిగిపడ్డ, సహాయక చర్యలకు అంతరాయం కలుగకుండా నగరంలో కి వచ్చే ట్రాఫిక్ ని వెస్ట్ బైపాస్ రోడ్డు కి మళ్లిస్తున్నామని సి పి వెల్లడించారు. నగరంలో 10 వేల సి సి కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లాలో 605 సచివాలయాల పరిధిలో అన్ని రకాలుగా సహాయక చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. 42 డ్రోన్స్ తో పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు కొన్ని చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. 24%ఇ%7 పోలీసులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విద్యుత్తు సరఫరా అంతరాయం ఏర్పడినా సెల్ ఫోన్స్ స్విచ్ ఆఫ్ ఐనా తమ వైపు నుంచి సమాచారం అందుకున్న వెంటనే స్పందించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని సి పి అన్నారు. 100....112... ఫోన్ నెంబర్లు కి ఫోన్ చెయ్యగానే తమ సిబ్బంది స్పందిస్తారని. ముఖ్యంగా ప్రజలు ఏంతో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అధికారులు చెప్పిన సలహాలు సూచనలు వెంటనే అమలు చేయాలని సి పి పిలుపునిచ్చారు.

# ఆర్ అండ్ బి రోడ్డుపై గేదెలను కట్టేసినా... పట్టించుకోరా...?

**● కట్టుబడిపాలెంలో గేదెలకు ఆవాసంగా మారిన ప్రధాన రహదారి ● రోడ్డుపై గేదెలు అడ్డంగా ఉండటంతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు. ● అక్రమణకు గురైన ప్రధాన డ్రైనేజి. అస్తవ్యస్తంగా పారిశుధ్యం ● పట్టించుకోని గ్రామ పంచాయితీ పాలకులు, ఆర్ అండ్ బి అధికారులు.**







**జి.కొండూరు: అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆర్ అండ్ బి రోడ్డు సగం ఆక్రమించి గేదెలను కట్టేసినా.. పట్టించుకోరా...? అని ప్రయాణికులు, వాహన చోదకులు గగ్గోలు పెడుతున్న ఘటన మండలంలోని కట్టుబడిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామంలో ప్రధాన రహదారి (కట్టుబడిపాలెం- కవులూరు ఆర్ అండ్ బి రహదారి) రెండువైపులా ఆక్రమణకు గురయ్యిం దని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రహదారికి రెండువైపులా ఉన్న పక్కా డ్రైనేజీలు అక్రమించ డమే కాకుండా మరో రెండు మీటర్లు ముందుకు వచ్చి వ్యాపార కార్యక్రమాలు సాగిస్తున్నారు. దీంతో డ్రైనేజీలలో పూడిక తొలగించడం కష్టంగా మారిందని గ్రామ పంచాయితీ పాలకులు చెబుతున్నారు. ముఖ్యంగా కొంతమంది గ్రామం లోని ఆర్ అండ్ బి రహదారిపై గేదెలను కట్టేయడంతో ఆ రహదారిన వచ్చేపోయే ప్రయాణికులు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.ఎదురెదురుగా వచ్చే వాహనాలు గేదెలు కట్టేసిన చోట తప్పు కోవడం కష్టంగా మారుతుంది. ఒక వాహనం వెళ్లిన తరువాత మరో వాహనం వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది. గ్రామ పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక ఆర్ అండ్ బి అధికారులైతే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని గ్రామస్తులు పెదవివిరుస్తున్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పేరుతో వారం వారం గ్రామంలో ప్రచారం చేయడమే తప్పా పారిశుధ్యం పై దృష్టి సారించడం లేదని గ్రాస్తులు గగ్గోలు పెడుతున్నారు.గ్రామ పంచాయతీ పాలకులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రహదారికి రెండువైపులా ఆక్రమణలు తొలగించి, రోడ్డుపై గేదెలు కట్టేయకుండా చర్యలు తీసుకొని, పారిశుధ్యం పై దృష్టి సారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# పునరావాస కేంద్రం సందర్శించిన ఉప్పాల రాము



**పెదన వార్తప్రభ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం పోడు గ్రామం మొంథా తుఫాన్ కారణంగా హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలను సందర్శించి ఇబ్బందులను అడిగి తెలుసుకుని అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చిన పెదన నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉప్పాల రాము ఈ కార్యక్రమంలో పెదన నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు జడ్పీటీసీ మైలా రత్న కుమారి పిన్నింటి మహేష్ వైదాని వెంకటరాజు నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...

# అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి..

## పెడనలో కాగిత కృష్ణ ప్రసాద్



**పెడన అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తుఫాన్ తీరం దాటే వరకూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని శాసన సభ్యులు కాగిత కృష్ణప్రసాద్ అన్నారు.పెడన పట్టణంలో తుఫాన్ పునరావాస కేంద్రాలను స్థానిక కృష్ణప్రసాద్ మంగళవారం సందర్శించి వసతులను పరిశీలించారు.అనంతరం లోతట్టు ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారుప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలి వ్యవసాయ అధికారులతో తుఫాన్ రక్షణ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలిగంటకు 100కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు తప్పనిసరిగా తీసుకోండిపంటలను సురక్షిత ప్రదేశాలకు తరలించండి- విద్యుత్ తీగలు, చెట్లు వద్దకు వెళ్లవద్ద- గృహాలలో అవసరమైన సరఫరాలను సిద్ధం చేసుకోండని కాగిత అన్నారు. కాగిత వెంట తాసిల్దార్ కూనప రెడ్డి రెడ్డి అనిల్ కుమార్ పిడుగు నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూమ్ (హన్ను) పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య మాజీ కౌన్సిలర్ యర్రా రాజా తదితరులు పాల్గొన్నారు.

# జిజిహెచ్ వార్డుల తనిఖీ.



**కాకినాడ : అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తుఫాను పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి, కాకినాడ సూపరింటెండెంట్ డా.లావణ్య కుమారి ఆసుపత్రిలో పలు విభాగాలలో పర్యటించారు.ఈ సందర్భంగా గైనకాలజీ, పిల్లల విభాగాలలో రౌండ్లు చేసి రోగులు, వారి సహచరులకు ఈదురుగాలులు, వర్షాలు,నీటి నిల్వలు వంటి తుఫాను ప్రభావాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.తుఫాను సమయంలో అనవసర ప్రయాణాలు నివారించాలని,పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఇంటి పరిధిలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు.అలాగే విభాగాల అధిపతులు, సిబ్బందితో సమావేశమై బెడ్ల అందుబాటు, అత్యవసర ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్లు, జనరేటర్లు సిద్ధత వంటి అంశాలను సమీక్షించారు.ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్ విభాగాలలో పవర్ బ్యాకప్, లైటింగ్,వెంటిలేషన్ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించారు.తుఫాను సమయంలో అత్యవసర సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాధిపతులకు సూచించారు.సూపరింటెండెంట్ అన్ని విభాగాలు అప్రమత్తంగా ఉండాలని, రోగుల భద్రతను ప్రాధాన్యతగా తీసుకొని సమయానుకూలంగా స్పందించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో డిప్యూటీ సూపరింటెండెంట్ డా. శ్రీనివాసన్,సీఎస్ఆ ర్ఎంవో డా.కోమల, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పన తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓసీ అందజేత



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 28 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన (లెటర్ ఆఫ్ క్రెడిట్) ఎల్ ఓసీ ను భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ తో కలిసి 40 వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పీవీ చిన సుబ్బయ్య, కూటమి నేతలు అందించారు..40వ డివిజన్, బ్యాంకు సెంటర్ కు చెందిన పీ వెంకటరత్నం (65) హృద్రోగం తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుందితనకి మెరుగైన వైద్యం అందించాలని శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం సాయం కొరకు దరఖాస్తు చేశారు. మంజూరైన రూ 6 లక్షల 55 వేల ఎల్ ఓ సీ ను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరితగతిన ఎల్ ఓసీ ను మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లం రాజు ట్రస్ట్ డైరెక్టర్ పీ సూర్య దుర్గ, కూటమినేతలు నక్కిట్ల రాజా, గంగవరపు సురేష్, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు సప్పా శ్రీనివాస్, కొల్లి దుర్గారావు, తిరుపతి రెడ్డి, యలమంచిలి ఫణీంద్ర , జ్యోత్స్న ప్రియ తదితరులు పాల్గొన్నారు.

## పునరావస కేంద్రాల వద్ద కూటమి నేతల సేవలు



**కోడూరు, అక్టోబర్28 (వార్తా ప్రభ) :**తుఫాన్ నేపథ్యంలో కోడూరు మండల పరిధిలోని తీర ప్రాంత గ్రామ ప్రజల రక్షణ కోసం ఏర్పాటుచేసిన పునరావస శిబిరాల వద్ద కూటమినేతలు విశేష సేవలు అందిస్తున్నారు. వి కొత్తపాలెం, స్వతంత్రపురం శిబిరాల వద్ద బిస్కెట్ ప్యాకెట్ల పంపిణీ, మధ్యాహ్న భోజనం వడ్డించే కార్యక్రమాలలో పాల్గొని తమ వంతు సేవలు అందిస్తున్నారు. రెవిన్యూ, పోలీస్ అధికారులకు బాసటగా నిలుస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ %ఎ% డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ చిలకలపూడి పాపారావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు, బీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు,మర్రె గంగయ్య, పిఏసిఎస్ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గున్నారు.

